దాలిగుంటలో కుక్కలు

వాళ్ల ఊళ్లో ఏంచేస్తుందోగాని, పండక్కి పర్వానికి పుట్టింటికి వచ్చినప్పుడు అక్కయ్యకు బొత్తిగా కాలం జరగదు. అందుకని బావ ఎక్కడెక్కడి పత్రికలూ తెస్తాడు. పిల్లల పత్రికలూ, ఆడవాళ్ల పత్రికలూ, మగవాళ్ల పత్రికలూ అన్నీ చదివేస్తుంది అక్కయ్య. చిట్టీ, బుల్లాడూ పిల్లల పత్రికలే చదువుతారు. మిగతావి బొమ్మలు చూసుకుంటారు. కాని అక్కయ్య అన్నీ చదివేస్తుంది.

బావ ఒక పత్రికలో ఒకమంచి కథ చూపించాడు. అక్కయ్యని చదవమన్నాడు. అక్కయ్య చదివింది. అర్థంకాలే దన్నది.

"నేను చదివి వినిపిస్తే అర్థమవుతుంది" అన్నాడు బావ.

"చదువు బావా, నేకూడా వింటా" అన్నది చిట్టి.

"నేకూడా వింటా బావా" అన్నాడు బుల్లాడు.

"ఏమిటోయ్ అదీ? మంచి కథా యేం? కొంచెం గట్టిగా చదివితే నేనుకూడా విని ఆనందిస్తాగా!" అన్నాడు నాన్న.

"అమ్మాయ్, ఈ వసారాలో చాపేసి దీపం పెట్టవే, చదువుతుంటే నాక్కూడా వినిపిస్తుంది!" అన్నది అమ్మ వంటింట్లోంచి.

బావ చదవసాగాడు. అమ్మ వింటున్నది. నాన్న వింటున్నాడు. బుల్లాడూ, చిట్టీ వింటున్నారు. సరే అక్కయ్య వింటూనే ఉంది.

మధ్యమధ్య బావ, కూలివాళ్లు సమ్మె ఎందుకు చేస్తారో, ఎట్లా చేస్తారో, వాళ్ళ సమ్మెను యజమానులెట్లా పడగొడతారో, కూలీలను లాకౌటు చెయ్యటమంటే ఏమిటో, పోలీసులు వచ్చి యజమానుల తరఫున ఎట్లా హింసలు పెడతారో అదంతా వివరంగా చెబుతూ కథ పూర్తిచేశాడు.

కథ చాలా బాగుందన్నది అక్కయ్య.

"యజమాన్లను చంపినా పాపంలేదు" అన్నది చిట్టి.

"వాళ్ళమీద లాఠీచార్జి చెయ్యాలి. అప్పుడుగాని వాళ్ళతిక్క వదల్దు" అన్నాడు బుల్లాడు.

"ఏముంది నాయనా, డబ్బుగలవాడిది రాజ్యం! కూలిచేసుకునే ముండా కొడుకులను అదిలించేవాళ్ళా, పాలించేవాళ్ళా? తిండానికింత ఉండికూడా మనమే ఇన్ని కష్టాలు పడుతుంటే, వాళ్ళగతి ఎట్లా ఉంటుంది, పాపం!" అన్నది అమ్మ కూరతిప్పుతూ.

"నా చిన్నతనంలో ఇంత అన్యాయం లేదోయ్! పనిచేసే వాడంటే ఎంతో ఆదరం ఉండేది. తిండికీ బట్టకీ లోటునేది పనివాళ్ళెరుగుదురా? కమతగాళ్ళున్నారంటే ఇంట్లో పెత్తనం దగ్గర్నుంచీ వాళ్ళదే. పనిచేసేవాళ్ళని పరాయివాళ్ళలే చూడటం ఎన్నడైనా కద్దా? ఈ రైళ్లూ, ఈ ఫాక్టరీలూ వచ్చి మరీ దేముడూ దైవమూ లేకుండా పోయింది. ఈ ఫాక్టరీలవాళ్లు ఇంతింత సంపాదిస్తున్నారు కదా, పోనీ ఆ కూలివాళ్ళ మొహాన ఇంత పారేస్తే ఏం? ఆశకైనా అంతుండొద్దూ? ఎబ్బే, ఛీ!" అన్నాడు నాన్న.

"ఇదంతా పోనిక్కండి గాని సమ్మె చేసినంతమాత్రాన పోలీసులు వచ్చి కూలీలమీద కాల్చటం దేనికి? పనికి రాకపోతే వాళ్ళకే నష్టంగా? కావాలంటే కూలీలు పని మానుకోకూడదా? వాళ్ళచేత బలవంతాన పని చేయిస్తారా?" అన్నది అక్కయ్య.

"అట్లాగా? ఒకరోజు పనివాడు కూలిమానేస్తే వాడికి కూలిడబ్బుకే నష్టం. యజమానికి అంతకంటె ఎక్కువ నష్టం. అదీకాక, పని మానదలిచిన కూలివాడు పదిహేను రోజులు ముందుగా యజమానికి నోటీసు ఇవ్వాలి. ఆ పదిహేను రోజుల నోటీసూ కూలీలు యజమానికి, కూలీలకు యజమానీ ఇచ్చి ఉంటారు" అన్నాడు బావ.

"సమ్మెకు ముందుగా నోటీసిస్తారు కాబోలుగా?" అన్నది అక్కయ్య.

"ఇస్తారు, ఇచ్చినా సమ్మె! పని మానుకోవటమూ ఒకటి కాదు. పని మానుకున్న కూలివాడు ఫాక్టరీ వొదిలిపోతాడు. సమ్మెచేసే కూలీ ఫాక్టరీ దగ్గరేవుండి, మరొకడు తన స్థానం ఆక్రమించకుండా చూస్తాడు."

"అందుకేనా పోలీసులు వచ్చి కాల్చటం!"

"అవును."

"పోలీసులకు ఫాక్టరీ యజమానులు జీతాలిస్తారా?"

"లేదు. మనం కట్టే పన్నులలోంచే పోలీసుల జీతాలు ఇస్తారు. ఐతే ప్రభుత్వాలు నడిపేవాళ్లు యజమానుల మంచికోరినప్పుడు సమ్మెలు విచ్ఛిన్నం చెయ్యక తప్పదు."

"కూలివాళ్ళని కాల్చటానికి పోలీసులు వెళ్ళకపోతే?" అన్నది చిట్టి.

"పోలీసులు వెళ్ళకపోతే కూలీల సమ్మె గెలవచ్చు. గెలిస్తే కూలీలకు యజమాన్లు ఎక్కువ జీతాలిచ్చుకోవాలి" అన్నాడు బావ.

"అట్లా అయితే బాగుంటుంది" అన్నది చిట్టి సంతోషంతో.

"అట్లా అయితే యజమానులు ఫాక్టరీలు మూసెయ్యవచ్చు. అప్పుడేం జరుగుతుంది? బట్టల మిల్లులు ఆడవు. మనకి బట్టలుండవు. ఏ మిల్లూ ఆడదు. మనకి అనేక వస్తువు లుండవు."

"ఏమీ లేకపోతే ఎట్లా?" అన్నాడు బుల్లాడు.

"అటువంటప్పుడు ప్రభుత్వం యజమాన్లమీద అధికారంచేసి మిల్లులు ఆడించవచ్చు. యుద్ధమప్పుడు కొన్ని మిల్లులు మూసేస్తే ప్రభుత్వం బలవంతాన తెరిపించింది."

"ఆపని చెయ్యకూడదూ?" అన్నది అక్కయ్య.

"పిచ్చిదానా, ఆ పని చెయ్యటానికి మాత్రం శక్తి - సామర్థ్యాలు ఉండొద్దూ? మనకున్న పరిస్థితుల్లో యజమానులు లాభాలకోసం వస్తువులు తయారు చేస్తారు తప్ప, నీకూ నాకూ అవి లేకపోతాయేమోనని తయారు చెయ్యరు. వాళ్లు లాభాలకోసం మిల్లులు నడిపినన్నాళ్లూ కూలీలకు దరిద్రం తప్పదు. దరిద్రం భరించలేక వాళ్ళు సమ్మెలు చెయ్యకా తప్పదు. సమ్మెలు చేస్తే ప్రభుత్వం యజమాన్లపక్షం వహించి కూలీలను దండించకా తప్పదు. కాల్చి చంపుతారని తెలిసికూడా కూలీలు సమ్మెలు చేస్తున్నారంటే, వాళ్ళ బాధ ఎటువంటిదో మనం ఊహించుకోవాలి" అన్నాడు బావ.

"నువ్వెంతైనా చెప్పవోయ్, దేహీ అని యాచిస్తే ఇవ్వనివాడె మన ధర్మం ప్రకారం పరమ పాతకుడు. ఉండికూడా కూలి సరిగా ఇవ్వనివాడు

పరమ ఛండాలుడనుకో. ఇదే కవి స్వరూపం. మాలకూడదంటారు గాని, ఆ రష్యాలో పడ్తే బాగుంది. ప్రతివాడికీ పనంటూ ఉందిట. ఎవరూ తిండికి మాడి చావరుట! ఇంకేంకావాలి? మనమాట ఎట్లావున్నా పాటకపు జనానికి రష్యా అంటే స్వర్గమే" అన్నాడు నాన్న.

"నిండు ప్రాణాల్ని కాల్చి చంపటం ఏమిట్రా? హత్యలు చేసే వాళ్ళని కూడా విచారణ జరిపి శాస్త్ర ప్రకారం ఉరి తీస్తారుగదా? పని చెయ్యనందుకు తుపాకులు బారుచేసి కాల్చుకుంటారా? ఇదేం రాక్షసం?" అన్నది అమ్మ కూడా.

బావ స్నానానికి లేచాడు. అక్క లేచి బావ తువాలూ, సబ్బూ పట్టుకుని స్నానాల గదికేసి వెళ్లింది. లాంతరు పట్టుకుని బావ కూడా వెనకి డితే వెళ్లాడు.

బయట బండి ఆగిన చప్పుడయింది. కాస్సేపట్లో సేతు మామయ్య లోపలికి వచ్చాడు.

"అమ్మోయ్, సేతు మామయ్యొచ్చాడేవ్!" అంటూ చిట్టి వంటింట్లోకి పరిగెత్తింది.

"ఏంరా సేతూ? ఏమిటి కబుర్లు? ఇదేనా రావటం? అంతా కులాసా?" అని నాన్న అడిగాడు.

"ఆ!" అన్నాడు సేతు మామయ్య కోపంగా. అయితే ఆ కోపం నాన్న మీద కాదు.

"ఏమిటి విశేషాలు?"

"ఆఁ, ఏం చెప్పేది? క్రిందటివారంలోనే ఇరవై మణుగుల పంచదార అందిస్తానన్నాడా లుచ్చాగాడు. ఇంతవరకు అతీపతీ లేదు. ఎంత నష్టమయిందనుకున్నావు?" అన్నాడు సేతుమామయ్య.

"పంచదారంటే జ్ఞాపకం వచ్చింది. నాలుగు వీసెలు పంపిస్తానంటివి కాదుట్రా? అన్నది అమ్మ ఇవతలికి వచ్చి.

"పాపం, వాడికవతల అందివాకపోతే వాడు మాత్రం ఏంచేస్తాడూ?" అన్నాడు నాన్న.

"ఒక పీశె తెచ్చారే. బెడ్డింగులో ఉంది" అన్నాడు సేతు మామయ్య.

"పోనీ బాబూ, బ్రతికించావు! ఛస్తున్నాం కొనలేక. ధరలెట్లా మండిపోతున్నయ్యో ఎరుగుదువా?" అన్నది అమ్మ.

"ఎందుకు తగలెయ్యను? ఇరవై మణుగులు పంపుతానని కోసిన వెధవ రెండు మణుగులైనా పంపాడేమో చూడు?"

"ఎవ్వడావాడూ?" అన్నది అమ్మ.

"ఉన్నాడులే!" అన్నాడు సేతుమామయ్య.

"అంత చాతకాని వాజ ఇస్తానని ఎందుకనాలీ?" అన్నది అమ్మ.

"ఇంకా లాభసాటిగా ఎవరికన్నా ఇచ్చాడేమో?" అన్నాడు నాన్న

"వాడంతవాడే అవును. కానీ కోసం గడ్డి తింటాడు. ఇరవై మణుగులు! పీశె రూపాయిన్నరకి కళ్ళకద్దుకుంటున్నారు. తలుచుకుంటే కళ్ళు తిరుగుతై! ఒక్క రూటులో ఎగిరిపోయి ఉంటుంది! అసలు నాకీ నెల అన్నీ నష్టాలే! కూలీ లంజకొడుకులు సమ్మె చేస్తున్నారు. వినలా?"

"లేదురా, ఇదెప్పణ్ణించి?" అన్నాడు నాన్న.

"మూడు రోజులయింది. మొదటి రోజూ నలుగురు పనిలోకి వచ్చారు. అందులో ఇద్దర్ని పట్టుకు చావగొట్టారు. రెండో రోజునుంచీ ఒక్క గాడిద కొడుకు పనిలోకి వస్తే ఒట్టూ! రోజుకు పదిహేను వందలు నష్టం! మంచి అదను! ఏం చెయ్యనూ? కనుపు బస్తాలు చాలవుట గాడిద కొడుకులకు! వాళ్ళు విరగొట్టేవాళ్ళు లేక...వీళ్ళు మిల్లు ముందు పికెటింగు చెయ్యకపోతె వంద మంది కూలీలను తెస్తును. రెండు రోజులపాటు వడ్ల బస్తాలు మిల్లు వాకిట్లో పడివున్నై. ప్రాణం విసిగి వాళ్ళూ వెళ్ళిపోయినారు...రోజుకు పదిహేను వందలు పోతున్నది కదా ఓ యాభై అధికంగా పారెయ్యమంటే పారెయ్యడా అని వాళ్ళ పాజం! వెధవలకి తోలీ ఇవ్వను" అన్నాడు సేతు మామయ్య.

పోలీసుల్ని పిలిపించి పికెటింగు చేసే వాళ్ళని మిల్లు ముందునుంచి వెళ్ళగొట్టించి కొత్త కూలీల్ని తెచ్చుకోకపోయినా?" అన్నాడు నాన్న.

"సరేలే! నాకు దాపరించిన వాళ్ళంతా అంతేలే. ఆ పోలీసు వెధవతో రారా అంటే రాడు. కూలీలు అల్లరి చేస్తున్నారా? నీ సొత్తు ధ్వంసం చేస్తున్నారా? అని అడిగాడు.

"ఇద్దర్ని కొట్టారంటివిగా?".

"మిల్లు దగ్గిర కొట్టారా? కాలవ గట్టున కొట్టారు. ఫలాని వాళ్ళు కొట్టారని సాక్ష్యమా? దెబ్బ తిన్న వెధవలే నిజం చెప్పకుండా ఉన్నారు. ఎన్నైనా చెప్పు బావా! కూలీ వెధవలంతా ఒకటే. జరక్క ఒకరిద్దరు వచ్చి ఏం లాభం?"

"పోనీ మీ—ఆ పోలీసు ఉద్యోగికి కాస్త చెయ్యి తడి—అన్నాడు నాన్న.

"ఇంకా నయం వీడుత్త కరోక్కటుకుడంటే! ఇదే పంతులయితే నా కిన్ని ప్లాట్లుండేవా?" అన్నాడు సేతు మామయ్య నిట్టూరుస్తూ.

అమ్మ పెట్టున నిట్టూర్చి, "కాలం కలిసిరాకపోతే అన్నీ అట్లాగే జరుగుతయ్యిలే. స్నానంచేసి భోంచేతువుగాని, మీరు కూడా లేవండి!" అన్నది నాన్నతో.